ప్రజాశక్తి

సోమవారం 23 అక్టోబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# రంగంలోకి రియల్టర్లు

రావికమతం మండలం కవగుంటలోని డి పట్టా భూమి (ఫైల్‌ఫొటో)

- అసైన్డ్ భూమి కొనుగోలుకు ఒప్పందాలు
- హక్కు రాగానే బదిలీకి ప్రయత్నాలు
- పిఒటి సవరణతో నాలుగు వేల ఎకరాలకు అర్హత
- సాగుదారులకే యాజమాన్య హక్కు
- క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది సర్వే

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

**పిఒటి చట్ట సవరణతో రియల్టర్లు, రాజకీయ నాయకులు, వారి బినామీలు రంగంలోకి దిగారు. అసైన్డ్‌దారులకు భూమిపై హక్కురాగానే తమ పేరున భూమి బదిలీ జరిగేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అసలింతకీ జిల్లాలో ఏం జరుగుతోందంటే..**

2003కు ముందు పేదలకు ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో పంపిణీ చేసిన భూములపై ప్రభుత్వం కల్పిస్తున్న యాజమాన్య హక్కు జిల్లాలో అతి కొద్ది మందికి లభించనుంది. 1977 ఎపి అసైన్డ్ భూముల చట్టం (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) సవరణ ప్రకారం భూమి పట్టా పొంది 20 ఏళ్లు పూర్తిచేసుకొని, ప్రస్తుతం సాగులో వున్న అర్హత కలిగిన పేదలు నాలుగు వేల మంది వున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా మిగతా 2లో..

మాట్లాడుతున్న జగ్గునాయుడు

# ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయండి

## సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

**ప్రజాశక్తి - ములగాడ :** నవంబరు 1 నుంచి ప్రారంభమయ్యే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం క్రాంతినగర్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విశాఖ మణిహారమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టి విశాఖ ఊపిరి ఆపేయాలని చూస్తోందన్నారు. ప్లాంట్ అమ్మకం నిలిపివేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికవర్గం అశేష త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను యజమానుల కాళ్ల కింద కట్టు బానిసల్లా నిలిపేందుకు ఒడిగట్టడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం విశాఖ కేంద్రంగా మిగతా 2లో..

# మెరుగైన రవాణా సేవలే లక్ష్యం

- ఆదాయార్జనకు ప్రత్యేక ప్రణాళికలు
- ప్రజాశక్తితో ఎపిఎస్‌ఆర్‌టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి

ప్రజాశక్తి - అనకాపల్లి

ప్రజలకు మెరుగైన రవాణా సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి అనకాపల్లి జిల్లా ప్రజా రవాణా అధికారి పద్మావతి తెలిపారు. ఆదాయార్జనకు సరికొత్త ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజా రవాణా వ్యవస్థ పనితీరును ఆమె 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

**అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం ఎన్ని బస్సులు ఉన్నాయి ?**

అనకాపల్లి డిపోలో 60 ఆర్టీసీ బస్సులు, 35 అద్దె బస్సులు, మిగతా 2లో..

## బొగ్గు లారీలతో బేజారు..

వార్త 5లో..

### పాలక రాజారావు మృతికి పలువురు సంతాపం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఆకాశవాణి పూర్వ సంచాలకులు పాలక రాజారావు మరణవార్త ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజారావు మృతి పట్ల ఆయన సహ ఉద్యోగి చంద్రశేఖర్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్నటువంటి అనేకమంది కళాకారులకు ఆలిండియా రేడియోలో కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పించిన ఘనత రాజారావుకే దక్కుతుందని వారు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాంస్కృతిక కళలను అభివృద్ధి పరచడంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. ఎయులోని పేద విద్యార్థులకు యువవాణి వంటి కార్యక్రమాలలో అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆకాశవాణి విశాఖపట్నం స్టేషన్ డైరెక్టర్‌గా ఆయన అందించిన సేవలను ఎవ్వరూ మరిచిపోలేరన్నారు. అటువంటి వ్యక్తి గుండెపోటుతో హఠాన్మరణం చెందడం ఉత్తరాంధ్రకు తీరని లోటని అన్నారు. ఇదిలా ఉండగా పాలక రాజారావు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి క్లాస్‌మేట్ కావడం విశేషం.

## మొదటి పేజీ తరువాయి..

### రంగంలోకి రియల్టర్లు

గుర్తించారు. చట్ట సవరణ ప్రకారం వీరికి యాజమాన్య హక్కు లభించనుంది. చట్టం అమలుకు సంబంధించి విధివిధానాల ప్రకారం జిల్లా స్థాయిలో అసైన్‌మెంట్ కమిటీని నియమించనున్నారు. ఈలోపు యాజమాన్య హక్కు కల్పించడానికి అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను తయారుచేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం వుంది. జిల్లాలోని 24 మండలాల్లోని 450 గ్రామాల్లో 48 వేల మంది దళిత, గిరిజన, పేదలకు 69 వేల ఎకరాలను ప్రభుత్వాలు పంపిణీ చేశాయి. ఈ భూమిలోని 39 వేల ఎకరాల వరకూ అన్యాక్రాంతం కావడం, అమ్మకాలు వంటివి జరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, ధనికుల చేతుల్లోకి ఈ భూములు వెళ్లాయి. వీటికి సంబంధించిన అసైన్‌మెంట్ రికార్డులు అందుబాటులో లేవని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో రెవెన్యూ సిబ్బంది తేల్చారు. మిగిలిన 30 వేల ఎకరాల్లో డి పట్టా పొంది 20 ఏళ్లు పూర్తి చేసుకొని సాగులోవున్న పేదలు నాలుగువేల మంది వున్నట్లు గుర్తించారు.

సాగులో వున్నవారిలో పట్టాదారులు, వారి వారసులు, కుటుంబ సభ్యులు వున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిలో పట్టాదారులు సాగులో వున్నారా? వారసులు లేదా కుటుంబ సభ్యులున్నారా? అమ్మకాలు జరిగాయా? అన్నది క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. యాజమాన్య హక్కు పొందడానికి డి పట్టాదారునికి వున్న అర్హతను గ్రామ స్థాయిలో విఆర్‌ఓ నిర్ధారించి తహశీల్దార్‌కు పంపించారు. తహశీల్దార్ రికార్డులను పరిశీలించి సంబంధిత ఆర్‌డిఒలకు నివేదించారు. తహశీల్దార్లు పంపిన జాబితాలో సగటున ఐదు శాతం వరకు ఆర్‌డిఒలు పరిశీలించి జాయింట్ కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిసింది. వివిధ దశల్లో జరిగిన ఈ పరిశీలనలో నాలుగు వేల మందికి యాజమాన్య హక్కు పొందడానికి అర్హతవుందని ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ జాబితాకు జిల్లా స్థాయిలో ఏర్పడబోయే అసైన్ కమిటీ ఆమోదముద్ర వేయాల్సివుంది. ఈ కమిటీ ఆమోదం తెలిపాక నిషేధిత భూముల జాబితా (22(ఎ)) నుంచి డి పట్టా భూములను తొలగించనున్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాల్సిన భూముల వివరాలను రిజిస్ట్రార్‌కు అధికారులు పంపించనున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

రిజిస్ట్రార్‌కు నివేదించిన తరువాత డి పట్టా భూమి విక్రయించుకొనే హక్కు పట్టాదారునికి రానుంది. ఇదంతా జరగడానికి ఇంకొంత కాలం పడుతుంది. నిషేధ క్లాజును తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అమ్మకానికి అవకాశమున్న అసైన్డ్ భూముల కొనుగోలుకు రియల్టర్లు, రాజకీయ నాయకులు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. అమ్మకం హక్కు రాగానే యాజమాన్య హక్కు బదిలీ చేసుకొనేలా కొంత అడ్వాన్స్‌లు చెల్లించి ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కాలపరిమితి ప్రకారం 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పించే ప్రక్రియ కొనసాగుతుందని రెవెన్యూ అధికారులు అంటున్నారు. డి పట్టా పొందిన భూమిలో 20 ఏళ్లు పూర్తిచేసుకొని ప్రస్తుతం సాగులో వున్నవారికే యాజమాన్య హక్కు కల్పిస్తామని చెబుతున్నారు. అన్యాక్రాంతం చేసిన, డి పట్టా భూమిని కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదుచేస్తామని తెలిపారు.

**అన్యాక్రాంత భూములపై పేదలకు హక్కు కల్పించాలి**

దళితులు, గిరిజనులు, పేదలకు పంపిణీ చేసిన భూముల్లో అన్యాక్రాంతమైన, అమ్మకాలు జరిగిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పట్టాదారులైన పేదలకు అందజేసి, యాజమాన్య హక్కు కల్పించాలి. అర్హులైన పేదలకు భూమి పంపిణీ చేయాలి.

**డి.వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి**

### ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయండి

ప్రత్యేక రైల్వేజోన్, వెనుకబడిన ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్న హామీ ఆచరణకు నోచుకోలేదన్నారు. తమకు అధికారం ఇస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆచరణలో ఉన్న ఉద్యోగాలను హరిస్తోందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టాక వంట గ్యాస్ సిలిండర్ ధరను ఎలా పెంచుకుంటూ పోయిందో వివరించారు. పెట్రోలు, డీజిల్ ధరలను భారీగా పెంచి నిత్యావసర వస్తువుల ధరలు పెంపునకు బిజెపి ప్రభుత్వం కారణమైందన్నారు. రాష్ట్రాల హక్కు అయిన విద్యుత్తు రంగాన్ని మోడీ ప్రభుత్వం తన గుప్పిట్లోకి లాక్కొని విద్యుత్తును తమ అనుయాయుడైన అదానీ చేతిలో పెట్టి ప్రజలు, రైతుల మీద విద్యుత్తు భారాలు మోపుతోందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి, ప్రజలకు ఇంత ద్రోహం చేస్తుంటే నిలదీసి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసిన రాష్ట్ర వైసిపి ప్రభుత్వం కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారడం శోచనీయమన్నారు. తన అధికార ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను కేంద్రం ముందు ఫణంగా పెట్టడం జగన్ సర్కారుకు తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్నులు, యూజర్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. రైతుల వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపు, వినియోగదారులకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రజలు తమ సమస్యలపై నిరసన తెలియజేసే హక్కును కాలరాస్తోందని, ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు తీవ్ర ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వ కబంధహస్తాల నుంచి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బయటకు వచ్చి రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంతో పోరాడాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల సమస్యల కన్నా ఇతర సమస్యలను పాలకులు ముందుకు తెస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రజల అసలు సమస్యలను అజెండాగా ముందుకు తెచ్చేందుకు సిపిఎం రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు యాత్రలను నిర్వహిస్తోందని జగ్గునాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మందసలో ప్రారంభమయ్యే బస్సు యాత్ర నవంబర్ 3, 4 తేదీల్లో విశాఖలో పర్యటిస్తుందని, ఆ యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్.వాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో క్రాంతినగర్ గ్రామ సంఘం అధ్యక్షులు కె.పరదేశి నాయుడు, సిపిఎం నాయకులు ఎన్.శ్రీనివాసరావు, డి.గోపాలకృష్ణ, జి.దుర్గాప్రసాద్, ఎం.ఆదినారాయణ, జి.నరేష్, జి.సత్యనారాయణ, కె.సత్తిరాజు, ఆర్.అప్పారావు, కె.రాము, కె.మురళి, ఎస్.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్ఫూర్తితో.. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు కృషి

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** జక్కన సత్యనారాయణ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం కృషి చేయాలని సిపిఎం, సిఐటియు నాయకులు ఉద్ఘాటించారు. పోర్ట్ యూనియన్ అధ్యక్షులు జె.సత్యనారాయణ ఉద్యోగ విరమణ, షష్టిపూర్తి కార్యక్రమాలు ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాగాయి. ముఖ్య అతిథిలుగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడారు. విశాఖపట్నం జిల్లాలో జక్కన సత్యనారాయణ యువకునిగా ఉండగా అందరికీ విద్య అందించేందుకు విద్యా కేంద్రం నడిపారన్నారు.

మాట్లాడుతున్న అజశర్మ, వేదికపై లోకనాథం తదితరులు

సారా వ్యతిరేక ఉద్యమం నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. విశాఖ పోర్టు డిఎల్‌బిలో చేరేటప్పటికి ఒకే ఒక్కడిగా ఆయన సిఐటియులో ఉన్నారని, రిటైర్ అయ్యేటప్పటికి మొత్తం కార్మికులను ఒక తాటిపైకి తీసుకొచ్చి కో-ఆపరేటివ్ సొసైటీకి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. పోర్టును కాపాడటంలో జక్కన సత్యనారాయణ కీలకపాత్ర పోషించారన్నారు. సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ అధ్యక్షత వహించారు. సత్యనారాయణ, రాములమ్మ దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. సత్యనారాయణ తల్లిదండ్రులు సత్యం, ముత్యాలమ్మ, మామ ఎస్.సోములు, కుమార్తెలు వరలక్ష్మి, సత్య, సుగుణ, అల్లుళ్లు వెంకటరావు, భాస్కర్, శ్రీను, వియ్యంకులు వెంకటేశ్వరరావు, పద్మావతి, అప్పారావు చిన్నమ్మలు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, కె.సత్యనారాయణ, కె.స్వతంత్ర కుమార్, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

## మెరుగైన రవాణా సేవలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి..)

నర్సీపట్నం డిపోలో 107 బస్సులు మొత్తం 202 బస్సులు 40 రూట్లలో నడుస్తున్నాయి. రోజుకు సుమారు ఈ రూట్లలో 66 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి.

**ఇంకా బస్సులు పెంచాల్సిన అవసరం ఉందా ?**

ప్రస్తుతానికి అన్ని రూట్లలో సరిపడా బస్సులు నడుపుతున్నాం. అయితే మారుమూల ప్రాంతాలకు బస్సుల డిమాండ్ ఉంది. సరిపడా ఆక్యుపెన్సీ రేటు లేకపోవడంతో నడపలేకపోతున్నాం.

**ఆదాయ పరిస్థితి ఎలా ఉంది ?**

ఉమ్మడి విశాఖ జిల్లా సమయంలో కూడా అనకాపల్లి, నర్సీపట్నం డిపోలు నష్టాల్లోనే నడిచాయి. ప్రస్తుతం ఏడాదికి రెండు కోట్ల మేర నష్టాలు వస్తున్నాయి.

**నష్ట నివారణ చర్యలు తీసుకుంటున్నారా ?**

నివారణకు పలు మార్గాలు అన్వేషిస్తున్నాం. అందులో భాగంగా ఆక్యుపెన్సీ రేటు పెంచడం, కార్గో బస్సులు నడపడం, ఆర్టీసీ డిపోల పరిధిలో ఉన్న స్టాల్స్ అద్దెకు ఇవ్వడం, ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా అధిక బస్సులు నడపడం వంటి చర్యల ద్వారా ఆదాయం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుత ఆరు నెలల కాలానికి 55 శాతం కార్గో ద్వారా నెలకు 15 లక్షల రూపాయల ఆదాయం సంపాదించగలుగుతున్నాం. ప్రస్తుతం ఆర్టీసీ జోన్లలో అనకాపల్లి జిల్లా ప్రథమ స్థానంలో ఉండడం సంతోషంగా ఉంది.

**ఈ దసరాకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారా ?**

దసరాకు ప్రత్యేకించి భవాని భక్తుల కోసం అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి 70 బస్సులు వేస్తున్నాం.

దీంతోపాటు విజయవాడ, పలాస, రాజమండ్రి, హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు బస్సులు నడుపుతున్నాం.

## ఘనంగా జర్నలిస్టుల దసరా సంబరాలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమని, వారి సహకారంతో మరింత ప్రగతి కోసం అందరం కృషి చేయాల్సిన అవసరముందని రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు అన్నారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు సంయుక్తంగా దసరా సంబరాలను ఘనంగా నిర్వహించాయి. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజం కోసం నిరంతరం జర్నలిస్టులు పాటుపడుతున్నారన్నారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీ ప్రగతి పథంలో జర్నలిస్టులు కూడా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా దసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫెడరేషన్ నగర అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ అందరి సహకారంతో తాము పలు జర్నలిస్టు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు వంటి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నామన్నారు. దసరా సందర్భంగా మౌనిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక

కళాకారులతో అతిథులు, ఫెడరేషన్ నాయకులు

కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.శ్రీనివాసరావు, నగర కార్యదర్శి బి.అనూరాధ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు, బ్రాడ్‌కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, ఎ.సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎన్.మధుసూదనరావు, యర్రపోతు రామకృష్ణ, పితాని ప్రసాద్, బి.శివప్రసాద్, రామకృష్ణ, కోశాధికారి సీతారామమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, విశాఖ సమాచారం సంపాదకులు సూరంపూడి వీరభద్రరావు, సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఉద్యోగ విరమణ చేసిన రఘునాథరావు (విజయ్), రమణారెడ్డి (సాక్షి) డి.రవికుమార్ (సాక్ష్యం), శ్రీహరిరాజు, ఇరోతి ఈశ్వరరావు, జి.శ్రీనివాసరావు తదితరులను ఫెడరేషన్ నాయకులు సత్కరించారు.

### పోలియోపై అవగాహన

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** వైజాగ్‌లోని రోటరీ క్లబ్‌లు బీచ్ రోడ్డులోని వైఎంసిఎ సమీపంలో మెగా పోలియో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు హాజరయ్యారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా 3020 పోలియో ఛైర్మన్ శోభన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. రోటరక్టర్లు, ఇంటరాక్టర్లు చేపట్టిన ఫ్లాష్‌మాబ్, డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. స్కేటింగ్ విన్యాసాలు కట్టిపడేశాయి.

## వైసిపి హయాంలో చేసిందేంటి ?

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** గడచిన నాలుగున్నర సంవత్సరాలలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు చేసిందేంటో చెప్పాలని తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ డిమాండ్ చేశారు. కేవలం విధ్వంసం, అరాచకాలు, బలవంతపు అరెస్టులు, మానవ హక్కుల ఉల్లంఘన రాష్ట్రంలో కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నర సంవత్సరాలలో 11 లక్షల కోట్ల రూపాయలను అప్పులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి అప్పుల కుప్పగా మార్చివేశారన్నారు. ఆ సొమ్మును ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. చంద్రబాబు అరెస్టు కక్షపూరితమన్నారు.

IN THE HON'BLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
I.P. 39/2023
Between :
**1) Badidhaboyana Adilakshmi,** W/o. Apparao, Hindu, aged 35 yrs, D.No: 58-9-68, Adilakshmi Nilayam, Saibaba Temple down, 4th Lane, New Karasa, NAD X Road, Visakhapatnam
**2) Badidhaboyana Apparao,** S/o. Chinna Rao, Hindu, aged 40 years.
- rest do - ...Petitioners
And
**Shaik Areef Sharaief** & 63 others ...Respondents
**GENERAL NOTICE**
The public are hereby informed that the above petitioners filed the above numbered I.P.39/2023 on the file of the Hon'ble II Addl. Senior Civil Judge Court, at Visakhapatnam to declare them as insolvents and the matter stands posted to **08-11-2023** for hearing. So, the public is hereby informed that objections if any can be raised in the above case before the Hon'ble Court on **08-11-2023** either in person or through an Advocate at **10:30 A.M.**
(By the Order of the Hon'ble II Addl. Senior Civil Judge Court, At Visakhapatnam)
**PERLA NOOKA RAJU, D. SHOBA RANI, G. RAMESH NAIDU, B. RAMU & T. SIREESHA**
Advocates, Visakhapatnam
**Cell: 97010 24046**

# దసరా సందడి

## సంతలు, దుకాణాలు కిటకిట
## జోరుగా పొట్టేళ్ల అమ్మకం

తగరపువలస మార్కెట్‌లో జోరుగా సాగుతున్న పొట్టేళ్ల అమ్మకం

ప్రజాశక్తి -యంత్రాంగం

**తగరపువలస :** దసరా పండగ నేపథ్యంలో స్థానిక ప్రయివేట్ మార్కెట్‌లో ఆదివారం పొట్టేళ్లతో పాటు కోళ్ల అమ్మకం జోరుగా సాగింది. సాధారణంగా ఇక్కడి మార్కెట్ ఆదివారం రద్దీగా ఉంటుంది. కూరగాయలు, ఆకు కూరలు అమ్మేందుకు రైతులు భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి వస్తుంటారు. దీంతో కూరగాయలు ఏక మొత్తంగా కొనే వారు, వాటిని అమ్మేందుకు వచ్చే రైతులు, కొనేందుకు వచ్చే స్థానికులతో మార్కెట్ కిట కిట లాడుతుంది. దసరా నేపథ్యంలో అదనంగా పొట్టేళ్ళు, కోళ్ల అమ్మకాలతో మార్కెట్ మరింతగా కిక్కిరిసి పోయింది.

పలువురు మేకలు, గొర్రెల పెంపకందారులు మార్కెట్‌కు అమ్మకానికి తెచ్చిన నాటు, పొరం పొట్టేళ్లను చూస్తే ముచ్చటేసిందని మార్కెట్ కు వచ్చిన కొందరు పేర్కొన్నారు. ఒక్కో పొట్టేలుకు రంగు రంగుల తాళ్ళు, బంతుల్లా ఉండేలా అందంగా పొట్టేలు ముఖ భాగంలో కొమ్ములకు మధ్యన అమర్చారు. చూడడానికి సొంపుగా కనబడ్డాయి. ఒక్కో పొట్టేలు ధర సుమారు రూ.15 వేలు నుంచి రూ.30 వేల వరకు ధర పలికింది. మేక పోతు ధరలు కూడా ఇంచు మించు దగ్గర్లోనే పలికాయి.

భీమిలి మండలం తాటితూరు, మజ్జివలస, అల్లుపేట, పద్మనాభం మండలం రేవిడి, ఆనందపురం మండలంలోని కొన్ని గ్రామాలు, ఇటు విజయనగరం జిల్లా డెంకాడ, భోగాపురం మండలాల్లోని మహారాజుపేట, బంగార్రాజుపేట, వల్లూరు తదితర గ్రామాల నుంచి ఉదయం 4.30 గంటలకే పొట్టేళ్లతో ఇక్కడి మార్కెట్‌కు గొర్రెలు, మేకల పెంపకం దారులు చేరుకున్నారు.

### నాటు కోళ్లకు గిరాకీ

వడ్డాది వారపు సంతలో అమ్మకానికి వచ్చిన నాటు కోళ్లు

**ప్రజాశక్తి - బుచ్చయ్యపేట:** దసరా సందర్భంగా నాటు కోళ్ల కు గిరాకీ ఏర్పడింది. ఆదివారం జరిగే వడ్డాది వారపుసంతలో అధిక సంఖ్యలో నాటు కోళ్ళు అమ్మకానికి వచ్చాయి. బుచ్చయ్యపేట, కందిపూడిరాజం, పొట్టి దొరపాలెం, కోమల్లపూడి, రావికమతం, తదితర గ్రామాల నుండి రైతులు, కోళ్ల పెంపకందారులు నాటు కోళ్లను అధిక సంఖ్యలో అమ్మకానికి తీసుకొచ్చారు. కోడి సైజును బట్టి రూ.వెయ్యి, రూ.1500 వరకు ధర పలికినా, ఇళ్లల్లో పూజలకు అవసరం కావడంతో ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. వారపుసంతంతా నాటు కోళ్లతో నిండిపోయింది.

## భారీగా పెరిగిన పూల ధరలు

కిటకిటలాడుతున్న ఆనందపురం పూలమార్కెట్

**ప్రజాశక్తి-ఆనందపురం:** దసరా సందర్భంగా ఆనందపురం పూల మార్కెట్ కిటకిటలాడింది. దసరా నవరాత్రుల నేపథ్యంలో ప్రతి గ్రామంలోనూ దేవీ నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. పూల కోసం వచ్చేవారితో మార్కెట్‌లో సందడి వాతావరణం కనిపించింది. పూలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. బంతి, గులాబీ, లిల్లీ, చామంతి, కనకంబరాలు, జాజులు, కాగడాలు ధరలు చుక్కలనంటాయి. మార్కెట్లో కిలో కనకంబరాలు రూ.4 వేలు, జాజులు రూ.1,400, కాగడాలు రూ.800, బంతి రూ.800, గులాబీ రూ.300, చామంతి రూ.300 వరకు అమ్ముడుపోయాయి. కనకంబరాలు, జాజుల ధరలను చూసి వినియోగ దారులు బెంబేలెత్తిపోయారు. సుమారు రూ.50 లక్షలకుపైగా వ్యాపారం జరిగింది.

దసరా పండుగ వేళ పూల ధరలే కాకుండా కొబ్బరికాయ, గుమ్మడి, నిమ్మ వంటి పూజా సామగ్రి, దుస్తుల ధరలు సైతం అధికంగానే ఉన్నాయని వినియోగదారులు చెబుతున్నారు. పండుగ రోజుల్లో అవసరమైన దినుసులు, పూజా సామగ్రి కొనాలంటే సామాన్యుడు భయపడే పరిస్థితి ఎదురవుతోంది. పండ్ల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. దీంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంది.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాశక్తి -మధురవాడ :** ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... చంద్రంపాలెం దుర్గానగర్‌లో గేదెల హేమలత (32), భర్త గౌరినాయుడు, కుమారుడుతో కలిసి నివాసముంటున్నారు. హేమలత సోదరుడు ఎర్రినాయుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వెళ్తున్నారు. ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హేమలత అక్కడికక్కడే మృతిచెందింది. సోదరుడు ఎర్రినాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. సోదరుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అప్పన్న ఆలయంలో ఆర్జిత సేవలు

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాద్రి అప్పన్న ఆలయంలో ఆదివారం స్వర్ణ పుష్పార్చన, గరుడ సేవా కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వర్ణపుష్పార్చన కార్యక్రమంలో భాగంగా భాండాగారంలో ఉంచిన స్వర్ణ పుష్పాలను వెండి పళ్లెంలో ఉంచి బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి, స్వర్ణ పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్య నిర్వహణాధికారి డి.భ్రమరాంబ, పర్యవేక్షకులు వెంకటరమణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

జివిఎంసి రెండో వార్డులో కరపత్రాలతో టిడిపి నాయకులు

### నమ్మివానిపేటలో 'బాబుతో మేము'

**ప్రజాశక్తి -తగరపువలస :** జివిఎంసి రెండో వార్డు పరిధి నమ్మివానిపేట గ్రామంలో టిడిపి వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి ఆధ్వర్యాన ఆదివారం బాబుతో మేము కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు, సిహెచ్.సాయి జయ శంకర్, బి.సూర్యనారాయణ, నమ్మి శ్రీరామ్, ఎం.సురేష్, జగన్నాథ, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ఇస్తున్న క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాశరావు

### పోలీసుల కౌన్సెలింగ్

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** అర్ధరాత్రి వేళ అనవసరంగా తిరిగే యువకులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నేర విభాగం ఎస్ఐ ఎస్.సూర్యప్రకాశరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. బీచ్ చూద్దామని అర్ధరాత్రి సమయంలో రావడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. బైక్ దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సిసి కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

### సిఎం వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

**ప్రజాశక్తి-పాడేరు:** ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యలపై ఆందోళన చేసే వారిని సంఘ వ్యతిరేక శక్తులుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలను సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తీవ్రంగా ఖండించారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారి గొంతు నొక్కడానికి చేసే ప్రయత్నంలో భాగమే ఈ మాటలు అని దుయ్యబట్టారు.

### ముగ్గురు కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

**ప్రజాశక్తి-ఆనందపురం :** ఆనందపురం మండలంలో గ్రామ కార్యదర్శులుగా పనిచేస్తున్న ముగ్గురికి అనకాపల్లి జిల్లాలో ఇఓపిఆర్‌డిలుగా ప్రమోషన్ లభించింది. ఆనందపురం మండలం తర్లువాడ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కె.కరుణాకరరావు, మామిడిలోవ కార్యదర్శిగా పనిచేస్తున్న బి.సత్యనారాయణ, ఆనందపురం గ్రామ కార్యదర్శి ఎన్‌వివి నరసింహమూర్తి ఇఓపిఆర్‌డి ప్రమోషన్‌పై అనకాపల్లికి బదిలీ అయ్యారు. ప్రమోషన్ పొందడంపై మండలంలోని పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు అభిమానులు కరుణాకరరావుకు అభినందనలు తెలియజేశారు.

కరుణాకరరావు

## తేలియాడుతున్న తామర పూలు

**ప్రజాశక్తి -తగరపువలస :** స్థానిక చిట్టివలస - చిల్లపేట నడుమ ఉన్న పెద్ద చెరువులో కొంత భాగం తామర పూలతో చూడ ముచ్చట గొలుపుతోంది. సహజ సిద్ధంగా తామర పూలు తేలియాడుతుంటే అటుగా వెళ్ళే వారు కాసేపు ఆగి వాటిని చూసి ముగ్ధులవుతున్నారు.

మానవ తప్పిదాల వల్ల కాల్వలు ద్వారా చెరువులోకి వచ్చే వ్యర్థాలతో అప్పుడప్పుడు దుర్వాసన వెదజల్లుతున్న విషయం విదితమే. ఇది ఓ వైపు ఉండగా, మరో వైపు ప్రకృతి పరంగా సహజ సిద్ధంగా చెరువులో తేలియాడే తామర పూలు స్థానికులకు చూసేందుకు సొంపుగా ఉన్నాయి.

చెరువులో తేలియాడుతున్న తామర పూలు

## పార్కుల అభివృద్ధి అంటూ వైసిపి నేతలకు అప్పగిస్తారా?

**ప్రజాశక్తి -మధురవాడ :** జివిఎంసి 6వ వార్డు పరిధి ఎంఎస్‌ఆర్ లే-అవుట్‌లో ఉన్న బటర్ ఫ్లై పార్కును రూ.1.90 కోట్లతో అభివృద్ధి చేస్తామని గొప్పలు చెప్పి ఇప్పుడు వైసిపి అప్పగిస్తారా అని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు ప్రశ్నించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమార్తె 6వ వార్డు కార్పొరేటర్ ప్రియాంక ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. పార్కులు అభివృద్ధి చేస్తామని నిధులు కేటాయించి ఇప్పుడు ఆ పార్కు స్థలం 484.39 చదరపు గజాలను వైసిపి నాయకులకు బదిలీ చెయ్యడం దుర్మార్గమన్నారు. పార్కును ఆనుకొని ఉన్న వైసిపి నాయకులు స్థలం అంత విలువైనదైతే బదిలీ చెయ్యవలసిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఇంత దుర్మార్గం జరుగుతున్నా ఈ భూ బదిలీపై టిడిపి నాయకులు స్పందించక పోవడం విచారకరమన్నారు. ఈ స్థలం కాపాడడానికి సిపిఐ తరుపున న్యాయ స్థానానికి వెళతామని తెలిపారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాగిరెడ్డి

## క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -యంత్రాంగం

**గాజువాక** : సైన్ ఇన్ బ్లూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన సమతానగర్‌లో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన గాజువాక నియోజవర్గ వైసిపి ఇన్చార్జి తిప్పల దేవన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సైన్ ఇన్ బ్లూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ, ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొంటాయని చెప్పారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు, షీల్డు ఈ నెల 25వ తేదీన బహూకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు అండిబోయిన అప్పారావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, గంగులూరి రోజారాణి, గొందేసి ప్రభాకర్‌రెడ్డి, జెర్రిపోతుల గోవింద గౌడ్, కుప్పిలి ప్రసాద్, చీరపు శంకర్, ఫణికుమార్, కమిటీ సభ్యులు భార్గవ్, అనీల్, నరేష్, మనోజ్, అశోక్, ఉదయ్, నవీన్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.

**తగరపువలస** : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హెచ్‌సిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసికోల్లాసానికి దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తిరుపతిరావు, క్రీడాకారులు ప్రతాప్, శాంతి, లోవరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

## ఘనంగా కల్యాణ్‌కుమార్ వర్ధంతి

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు కీర్తిశేషులు చౌదరి కల్యాణ్‌కుమార్ ప్రథమ వర్ధంతిని మాధవధారలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, అసోసియేషన్ పేరిట ఎన్నో సేవా కార్యక్రమాలను కల్యాణ్‌కుమార్ నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. ఆయన లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. అసోసియేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు ఆయన పేరిట నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సుదర్శనరావు, కిషోర్, పెద్దరాజు, చంటి, నర్సింగ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనం ఈ - మాసపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి- ములగాడ : ప్రముఖ చిత్రకారుడు, చిత్రకళోపాధ్యాయుడు డిఎస్.మనోహర్ సంపాదకత్వంలో రూపొందిన చిత్రలేఖనం ఈ మాసపత్రికను ఆదివారం మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ప్రముఖ శిల్పి, చిత్రకారుడు టి.ప్రభాకరాచారి ఆవిష్కరించారు. నానాటికి ఆదరణ కోల్పోతున్న చిత్రకళారంగానికి ఈ పత్రిక ఎంతో ఉపకరిస్తుందని ఆచారి అన్నారు. చిత్రకళా పరిషత్ గౌరవాధ్యక్షులు జెకెవి.రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుంకర చలపతిరావు, సిఎస్.రాజు, శివ, బాలు, బుజ్జి, గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చిత్రలేఖనం ఈ మాస పత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు

# పాలస్తీనియన్ల స్వతంత్ర పోరాటాన్ని బలపర్చాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పాలస్తీనా జాతీయ విముక్తి పోరాట సంఘీభావ ఉద్యమాన్ని, వాళ్ల స్వతంత్ర పోరాటాన్ని బలపరచాలని, వెంటనే యుద్ధాన్ని విరమించాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను ఆమోదించి, స్వతంత్ర పాలస్తీనాను ఏర్పాటు చేయాలని ఇప్టూ నాయకులు ప్రసాద్ డిమాండ్‌చేశారు. విశాఖ పౌర గ్రంథాలయంలో జాతీయ విముక్తి పోరాట సంఘీభావ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్న నిజ జీవిత సమస్యలను వివరించారు. పాలస్తీనా భూభాగాలను కబ్జా చేయడానికి అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఇజ్రాయిల్ దుర్మార్గమైన విధానాలను అనుసరిస్తూ వస్తోందన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, అమెరికన్ సామ్రాజ్యవాదం తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రపంచ దేశాల్లో అనేక ప్రాంతాల్లో తన అనుకూల కేంద్రాలను ఏర్పాటుచేసుకొని ప్రజల మధ్య వివాదాలను సృష్టించిందని, యుద్ధాల ద్వారా ఆయుధాలు అమ్ముకుంటోందని ఆరోపించారు. పాలస్తీనా ప్రజలు సాగిస్తున్న న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలియజేశారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది కె.పద్మ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మానవ హక్కుల వేదిక ప్రతినిధి శరత్, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త చంద్రశేఖర్, భారత బచావో విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షులు వేమన పాల్గొన్నారు.

# దొంగతనం పేరిట వేధింపులు

ప్రజాశక్తి-పెందుర్తి : దొంగతనం చేసావంటూ తమను మానసికంగా వేధిస్తున్నారని జివిఎంసి 96వ వార్డు పరిధిలోని ప్రశాంతినగర్ సింహరెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాచ్‌మ్యాన్ కొరువాడ స్వామి, అతని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆదివారం మీడియాతో వారు మాట్లాడుతూ, అపార్ట్‌మెంట్‌లోని 103వ ఫ్లాట్లో డిల్లీష్ నివాసముంటున్నాడు. అతని ఇంట్లో దొంగతనం చేసావంటూ తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని స్వామి పేర్కొన్నారు. ఎలాంటి ఆధారం లేకుండా కేవలం అనుమానంతో నిరుపేదలమైన తమను నిరంతరం వేధిస్తున్నారని వాపోయారు. మాంత్రికుడు వద్ద గోరులో తాను కనిపించానంటూ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని తెలిపారు. గత మే నెలలో దీనిపై ఫిర్యాదు చేయగా అప్పటి నుంచి పోలీసులు తరుచూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించడంతో తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని స్వామి కుటుంబ సభ్యులు ఆవేదన వెలిబుచ్చారు. డిల్లీష్ బారి నుంచి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబానికి ఏమి జరిగినా డిల్లీష్‌దే బాధ్యతని వారు పేర్కొన్నారు. పొట్టకూటికోసం కోటపాడు మండలం నుంచి వచ్చామని చెప్పారు. ఈ ఘటనపై అపార్ట్‌మెంట్ పెద్దలు సమావేశం నిర్వహించి చర్చించడానికి ఏర్పాట్లు చేసినప్పటికీ డిల్లీష్ ముందుకు రావడంలేదని వివరించారు.

# గెలుపే లక్ష్యంగా పనిచేయండి

### ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక : అసెంబ్లీ ఎన్నికలకు మరో నాలుగు నెలలే సమయం ఉందని, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపునిచ్చారు. గాజువాక టిఎన్ఆర్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పటినుంచే ప్రతి కార్యకర్తా పార్టీ కోసం పనిచేయాలన్నారు. ఈ నెల 28 తేదీన విశాఖనగర్‌లో వైవి.సుబ్బారెడ్డి ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 6వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు పాత గాజువాకలో బీసీ బస్సు యాత్ర జరుగుతుందని, ఈ రెండింటిని జయప్రదం చేయాలని కోరారు. కష్టపడి పనిచేసే వారిని పార్టీ గుర్తించి పదవులు ఇస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి కార్పొరేటర్లు, వైసిపి నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, వంశీ రెడ్డి, వై.మస్తానప్ప పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

## దసరా సంబరాలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : 92వ వార్డు పరిధి గోపాలపట్నం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో దసరా సంబరాలను పశ్చిమ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళ లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను అమలుచేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ఆనంద్ కుమార్‌ను గెలిపిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తారన్నారు. గెలిచిన తర్వాత ఇంటికే పరిమితమయ్యే నాయకులు కావాలో, అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న నాయకులు కావాలో మీరే నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన దసరా, దీపావళి కానుకలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, ఎలమంచిలి మున్సిపల్ ఛైర్మన్ రమ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పశ్చిమ నియోజకవర్గ పరిశీలకులు ఎస్ఎ.రెహమాన్, నాయకులు బెహరా భాస్కరరావు, పేడాడ రమణకుమారి, గునిశెట్టి శ్రీనివాసరావు, జి.అప్పలస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# పలుచోట్ల అన్న సమారాధనలు

మాధవధారలో అన్నసమారాధన

ప్రజాశక్తి-యంత్రాంగం : దేవీ నవరాత్రులను పురస్కరించుకొని పలుచోట్ల ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

**ఆనందపురం** : మండలంలోని ఆనందపురం పంచాయతీ పొడుగుపాలెంలో అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి కోరాడ రాజుబాబు, నాయకులు మీసాల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు బంటుపిల్లి అప్పలస్వామి, బంటుబిల్లి రమణమ్మ, కొట్టియాడ రెడ్డిబాబు, కె.లక్ష్మణమూర్తి, కర్రోతు సత్యనారాయణ, బంటుపిల్లి వెంకటరావు, బంటుపిల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కల్లివానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మి, ముత్యాలరావు, వైస్ ఎంపిపి బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ, ఉప్పాడ సూరిబాబు, రామిరెడ్డి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు

**మాధవధార** : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సీతన్న గార్డెన్స్‌లో శ్రీదుర్గా గాయత్రి, కనక మాహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త సనపల కీర్తి ఆధ్వర్యాన ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, తెలుగుదేశం ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు ప్రారంభించారు.

**గాజువాక** : జివిఎంసి 87వ వార్డు పరిధి రదాలమ్మ శెట్టి బలిజ సేవా సంఘం, ఈ సేవా గ్రౌండ్, కణితి గౌరీ సేవా సంఘం ఆలయాలలో అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సింహాద్రి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీ ఛైర్మన్ సిగలపల్లి రవి, వార్డు వైసిపి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కోమటి శ్రీను, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, ఆడారి శ్రీను, ప్రగడ రాము, కేశవ, రాంబాబు, గెద్దాడ అప్పారావు, చొప్ప శ్రీను, దేవర అప్పారావు, పల్ల శ్రీను, పాల్గొన్నారు.

**ఆరిలోవ** : ఎర్నిదుర్గ మహంకాళీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెదగదిలి సాలిపేట ఈశ్వరదేవి నగర్‌లో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి పీఠాధిపతి అభిరామ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. పెదగదిలి, చినగదిలి, దీనదయాళ్‌పురం కొండవాలు ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక సంఘం నాయకులు, యువకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

**అనకాపల్లి** : మండలంలోని బిఆర్‌టి కాలనీలో విజయదశమి సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్), ఆయన తనయుడు సతీష్ (సంజుబాబు )పాల్గొన్నారు. వీరికి బాణసంచాతో స్వాగతం పలకగా, అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో యువసేన సభ్యులు, సంజుబాబు టీం సభ్యులు పాల్గొన్నారు.

వడ్లపూడిలో అన్న సమారాధన చేస్తున్న నాగిరెడ్డి

# బొగ్గు లారీలతో బేజారు..

- సామర్థ్యానికి మించిన లోడుతో ప్రయాణం
- కనీస నిబంధనలు పాటించని వాహనదారులు
- కాలుష్యంతో నిత్యం తప్పని ఇబ్బందులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

సామర్థ్యానికి మించిన లోడుతో రోడ్డు మధ్యలో ఆగిపోయిన బొగ్గు లారీ

**ప్రజాశక్తి - పరవాడ:** పరవాడ మండలం కేంద్రంగా రేసుగుర్రాల్లా దూసుకుపోతోన్న బొగ్గు లారీలతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు బెంబేలెత్తి హడలిపోతున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా, అతివేగంగా వెళుతున్న లారీల నుంచి వెలువడే కాలుష్యంతో ఈప్రాంతమంతా బొగ్గుమయంగా మారడం ఒకటైతే, వీటి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు వాపోతున్నారు.

ప్రధానంగా లంకెలపాలెం నుంచి పరవాడ మీదుగా హిందూజా, థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గును సరఫరా చేసే లారీల దూకుడు నిత్యం ప్రజలకు హైరానాకు గురిచేస్తోంది. కొత్తవలస నుంచి డంపర్ లారీల ద్వారా ఒక రోజుకు సుమారు 15 వందలకు పైగానే లారీలు తరలిస్తున్నారు. లారీలను డ్రైవర్లు రేసుగుర్రాల మాదిరిగా నడుపుతున్నారు. ప్రధానంగా పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ నుండి హిందూజా థర్మల్ పవర్ ప్లాంట్‌కు, అలాగే అచ్చుతాపురం పరిసర ప్రాంతాల్లోకి ట్రిప్పుల లెక్కన నడుస్తుండటంతో ఈ బొగ్గు లారీలు నడిపే డ్రైవర్లు వేగానికి అడ్డూఅదుపు లేకుండాపోతోంది. రెండురోజుల క్రితం పరవాడలో గొర్రెల మందపై శరవేగంగా లారీ దూసుకెళ్లిన ఘటనలో 32 గొర్రెలు మృత్యువాత పడగా, అనేక జీవాలు గాయాలపాలయ్యాయి.ఇలాంటి ఘటనలు ఈ మార్గంలో షరామామూలేనని, అయినా అధికారులు, నేతలెవరికీ పట్టడం లేదని పరవాడ ప్రాంత వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

లంకెలపాలెం జంక్షన్ నుంచి ఊటగెడ్డ జంక్షన్ వరకు వెళ్లే ప్రధానరహదారి మూల మలుపు ప్రమాదాలకు నెలవుగా మారితోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పైన పరదాలు లేకుండా వెళుతున్న బొగ్గు లారీల ద్వారా కింద పడే బొగ్గు పెళ్లల పైనుంచి భారీ లోడులతో లారీలు వెళ్లడంతో ఆ బొగ్గుకాసాత బూడదగా మారి విపరీతమైన దుమ్ము ధూళితో ఈ మార్గమంతా కాలుష్య కారకంగా మారుతోంది. కాలుష్యంతో పాటు ఈ రోడ్డంతా సన్నని బొగ్గు చూరతో నిండటంతో ద్విచక్రవాహనాలు స్కిడ్ అయి జారిపడుతున్నాయి. ఈ ప్రాంతాలను శుభ్రం చేసేందుకు ఇద్దరు కార్మికులను నియమించినా ఫలితం అంతంత మాత్రంగానే ఉంది. లారీలపై సరైన

రోడ్డు పొడుగునా అడ్డదిడ్డంగా ఆగి ఉన్న బొగ్గు లారీలు

విధానంలో టార్పాలిన్లు కట్టడం లేదు. సామర్థ్యం మించి అధిక లోడుతో బొగ్గు లారీల యథేచ్ఛగా సాగుతూ, ప్రయాణికులు, వాహనదారులతోపాటు స్థానిక ప్రజలు ఇబ్బందులుపడుతున్నా, వీటిని పర్యవేక్షించి, నియంత్రించాల్సిన రవాణా, ఆర్అండ్‌బి, పోలీస్ యంత్రాంగం కనీసం కన్నెత్తి చూడడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరికి అందాల్సిన ముడుపులు వారికి అందడంతో నిబంధనలు అతిక్రమించినా, కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నపుడు బొగ్గు కాలుష్యంపై నానా యాగీ చేసిన వైసిపి నేతలు, అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా దీనిపై కనీసం దృష్టి సారించలేదనే విమర్శలూ ఉన్నాయి. బొగ్గు లారీల వలన ప్రధానంగా రోడ్లు ధ్వంసం అవ్వడం, విపరీతంగా కాలుష్యం, రోడ్లపై బొగ్గు వెదజల్లే విధంగా సామర్థ్యానికి మించి ప్రయాణం చేయడం, ప్రమాదాలు ఇక్కడ సర్వసాధారణంగా మారిపోయాయి. అయినా ప్రజల కష్టాలు ఎవరికీ పట్టకపోవడం దారుణమని, ఇప్పటికైనా ప్రజాప్రతినిధులతోపాటు సంబంధిత శాఖల అధికారులు స్పందించి, బొగ్గులారీలతో ఉత్పన్నమయ్యే కాలుష్యంతో 1పాటు ఇతరత్రా సమస్యలను పరిష్కరించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## ఉద్యోగులకు నయవంచన

### ముఖ్యమంత్రి జగన్‌పై బుద్ధ ఫైర్

సమావేశంలో మాట్లాడుతున్న నాగ జగదీష్

**ప్రజాశక్తి -అనకాపల్లి:** తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వారం రోజుల్లోగా సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ పునరుద్ధరిస్తామని ఉద్యోగులను నమ్మబలికిన సీఎం జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని తుంగలో తొక్కి వారిని మోసగించారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, మూడు లక్షల మంది ఉద్యోగస్తుల భవితవ్యానికి సంబంధించి, జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో అనేక బహిరంగ సమావేశాల్లో మాయ మాటలు చెప్పి, నాలుగున్నరేళ్లపాటు దీన్ని సాగదీసి, ఎట్టకేలకు సిపిఎస్, ఒపిఎస్ కాకుండా జిపిఎస్ అంటూ ఉద్యోగులను జగన్ నయవంచనకు గురిచేశారన్నారు తమకిచ్చిన హామీల సాధనకు. ఉద్యోగులు ఉద్యమానికి సిద్ధపడితే, పోలీసులతో వారి ఆందోళనను అణిచివేయడమే కాకుండా, క్రిమినల్ కేసులు నమోదు చేసి ఉద్యోగుల జీవితాలతో జగన్‌రెడ్డి చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల వేతన బకాయి చెల్లించాలి

మాట్లాడుతున్న సిఐటియు నేత శంకరరావు

**ప్రజాశక్తి -అనకాపల్లి :** విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులకు మూడు నెలల వేతన బకాయి చెల్లించాలని ఎపి కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ అనకాపల్లి శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్ నెరవేర్చకపోగా, వారికి సక్రమంగా వేతనాలు చెల్లించక ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. మూడు నెలలుగా జీతాలు లేకపోతే, కుటుంబాలతో ఎలా బతకాలో చెప్పాలని డిమాండ్ చేశారు. దసరా పండగకు ఉద్యోగులను పస్తులు పెట్టడం దుర్మార్గమన్నారు. కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం ఎక్కడ కానరాలేదన్నారు. జీతాలు, పర్మినెంట్ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివాజీ పాల్గొన్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న అంజిబాబు

**ప్రజాశక్తి- కె.కోటపాడు :** క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని జనసేన మండల నాయకులు కుంచ అంజిబాబు అన్నారు. ఆదివారం మండలంలోని చౌడువాడలో యువతకు మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ సమకూర్చిన వాలీబాల్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో శివ. మల్లునాయుడు. అర్జునురావు. అప్పారావు బంగారు నాయుడు. వారం బాబు పాల్గొన్నారు.

## దసరా శుభాకాంక్షలు

**ప్రజాశక్తి- దేవరాపల్లి :** దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని తెలుగు ప్రజలందరికీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం తారువలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ, జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్కరికీ విజయాలు సిద్ధించాలని, సీఎం జగన్మోహనరెడ్డి సారథ్యంలో రాష్ట్రం మరింత పురోభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

## అ'పూర్వ' కలయిక

కలుసుకున్న 1994 -95 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు

**ప్రజాశక్తి -కశింకోట :** మండలంలోని కన్నూరుపాలెం హైస్కూల్‌లో చదివిన 1994 -95 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది ఈసందర్భంగా పాతమిత్రులంతా పరస్పరం క్షేమసమాచారాలను అడిగి తెలుసుకుని రోజంతా ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సాయిరాం, అప్పారావు పాల్గొన్నారు

## ప్రతిభకు ఆర్థిక ప్రోత్సాహకాలు

స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న ఎంపీ సత్యవతి

**ప్రజాశక్తి- అనకాపల్లి :** అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు, తమకు వచ్చిన ఆర్థికప్రోత్సాహకాలతో బాగా చదువుకుని మరింత అభివృద్ధి చెందాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి,డాక్టర్ విష్ణుమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణమండపంలో శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపి సత్యవతి మాట్లాడుతూ, ప్రతిభను ప్రోత్సహిస్తున్న గౌరీ సేవా సంఘాన్ని అభినందించారు.కార్యక్రమంలో కొణతాల రాజేంద్రప్రసాద్, గౌరీ సేవా సంఘం అధ్యక్షులు బొడ్డేడ సన్యాసినాయుడు , గౌరీ సేవా సంఘం కార్యదర్శి బుద్ధ రమణాజీ, మళ్ల సాంబశివరావు, డాక్టర్ కె ఏ వి సుబ్రహ్మణ్యం, లావణ్య, బొడ్డేడ రాము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రానికి విద్యుత్ పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి -అచ్యుతాపురం:** తిమ్మరాజుపేట గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రానికి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు కోరారు. గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రానికి నిధులు మంజూరైనా, మూడేళ్లుగా నిర్మాణ పనులు జాప్యం జరుగుతూ నేటికీ పూర్తికాని పరిస్థితి ఉందన్నారు దీంతో కొంతకాలంగా సామాజిక భవనంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహిస్తున్నారన్నారు.దానికి విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో ఇటీవల హెల్త్ సబ్‌సెంటర్‌కు కరెంట్‌ను కట్ చేశారన్నారు.. అప్పటినుంచి ఆరోగ్య ఉపకేంద్రంలో కరెంటు లేక వైద్య సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడడంతోపాటు విలువైన వ్యాక్సిన్లు నిల్వకు సమస్య ఏర్పడిందన్నారు. వ్యాక్సిన్లు పెట్టడానికి డీప్ రిఫ్రిజిరేటర్ ఉన్నా కరెంట్ లేదని, దెబ్బ తగిలి వైద్యానికి వస్తే కట్టు కట్టడానికి బ్యాండేజ్ లేదని, రోగులను పడుకుండబెట్టి, వైద్యం చేయడానికి సరైన బల్ల కూడా లేని దుస్థితి ఉందన్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# అలరించిన నేల వేషాలు

పెదపాడు ఊరేగింపులో నేలవేషాల సందడి

ప్రజాశక్తి -అచ్చుతాపురం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అందలాపల్లి కొండపై వెలసిన భగీరధి అమ్మవారి ఆలయంలో ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు ప్రత్యేకమైన పూజలు చేశారు. పెదపాడు గ్రామంలో మాజీ జెడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జనపరెడ్డి నరసింహరావు ఆధ్వర్యంలో సారె ఊరేగింపు ఘనంగా చేశారు. ఈ సందర్భంగా వేసిన నేలవేషాలు అలరించాయి. పలు రకాల పిండివంటలు పట్టుకొని వందలాది మంది మహిళలు ప్రదర్శనగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. తిమ్మరాజుపేటలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో దుర్గంబిక ఆలయంలో కోలాటం ప్రదర్శన, సారె, ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఎం జగన్నాధపురంలో గాజులతో అమ్మవారిని అలంకరించారు. వెదురువాడ, కొత్త మోసయ్యపేట, తిమ్మరాజుపేట, అచ్యుతాపురం గౌరీ పరమేశ్వరుల ఆలయంలో, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో కీర్తనలు, కోలాటాలు అలరించాయి. ఇందిరమ్మ కాలనీలో అన్నసమారాధన నిర్వహించారు.

# 1200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

బెల్లం ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామశివారులో నాటుసారా తయారీ స్థావరాలపై ఆదివారం దేవరాపల్లి పోలీసులు దాడులు చేసి, నిల్వ ఉంచిన బెల్లం పులుపులను ధ్వంసం చేశారు. స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపిన వివరాలివి. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేసి, నాటుసారా తయారీకి ఉపయోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు, సిల్వర్ పాత్రలను స్వాధీనం చేసుకున్నామని, ఈ సందర్భంగా 1200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. మండలంలో సారా తయారీ, అమ్మకాలకు పాల్పడుతున్న వారికి పాల్పడిన గుర్తించి,వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాటు సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

# మత్స్యకారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : పారిశ్రామికవేత్త దిలీప్ చక్రవర్తిని హైదరాబాదులో నక్కపల్లి మండలం చిన్న తీర్ల ఎంపిటిసి నాగేశ్వరావు కుటుంబ సభ్యులతో వెళ్లి కలిసారు. ఈ సందర్భంగా దిలీప్ చక్రవర్తి దృష్టికి మత్స్యకారుల సమస్యలు విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచి, వారికి సమాజంలో మంచిస్థానం పొందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో బిసి చార్టర్‌ను పొందుపరిచి, దానికి ప్రాధాన్యతనివ్వడం ద్వారా మత్స్యకారుల అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సి ఉందన్నారు.

దిలీప్ చక్రవర్తితో చిన్నతీర్ల ఎంపిటిసి నాగేశ్వరరావు

# స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు నిధుల లేమి!

- రెండేళ్లకుపైగా గ్రాంట్ విడుదల చేయని ప్రభుత్వం
- చిన్నపాటి కార్యక్రమాలకు సొమ్ముల కొరత
- సొంత డబ్బు ఖర్చు చేస్తున్న హెచ్ఎంలు

ప్రతినెలా స్కూలు కాంప్లెక్స్ నిర్వహించే రైల్వేస్టేషన్ జెడ్‌పి హైస్కూలు

ప్రజాశక్తి - యలమంచిలి : పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష సంయుక్త నిర్వహణలో ఉపాధ్యాయులకు పాఠశాల సముదాయ(స్కూల్ కాంప్లెక్స్) కేంద్రాల్లో నెలలో ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదిలో కనీసం 8 శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్ణీత ప్రాంగణాల్లో శిక్షణ తరగతులు జరుగుతున్నా, వీటి నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి గ్రాంట్ విడుదల చేయకపోవడంతో స్కూలు కాంప్లెక్స్‌లు నిర్వహించే హెచ్ఎంలు వాటికయ్యే ఖర్చులు సొంతంగా వెచ్చించాల్సి వస్తోంది.

ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు రెండు విడతలుగా రెండురోజుల పాటు అలాగే సబ్జక్టు టీచర్లకు ఆయా సబ్జెక్టులకు సంబంధించి వేర్వేరుగా ఒక్కో రోజు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తారు. ఈ శిక్షణకు ఉపాధ్యాయులు మాత్రం తప్పని సరిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ శిక్షణలో బోధనకు సంబంధించిన మెలకువలు, అమలు, వినూత్న పాఠ్యబోధన తదితర అంశాలపై అనుభవాలతో కూడిన శిక్షణ ఉంటుంది.

యలమంచిలి మండలంలో ఇటువంటి స్కూలు కాంప్లెక్స్‌లు ఆరు ఉన్నాయి. అవి ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాల, కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూలు, రైల్వేస్టేషన్ జెడ్‌పి హైస్కూలు, పురుషోత్తపురం, పులపర్తి , సోమలింగ పాలెంలలో నిర్వహిస్తు న్నారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు వచ్చే ఉపాధ్యాయులకు టీ, స్నేక్స్, అల్పాహారం, భోజనం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ శిక్షణ తరగతులు, సమావేశాల నిర్వహణకు ఒక్కో స్కూలు కాంప్లెక్సు గతంలో రూ.22 వేలు వరకు నిధులు విడుదల చేసేవారు. గత రెండేళ్ల నుంచి స్కూలు కాంప్లెక్స్, ఎమ్మార్సీ గ్రాంట్లు కూడా విడుదల కావడం లేదు. దీంతో వీటి నిర్వహణ భారం ఆయా స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలపై పడుతోంది. ఒక్కసారైతే ఫర్వాలేదుగానీ, ప్రతినెలా ఇలా స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ భారం తమపై పడడంతో ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.

ఏ గ్రాంటులూ లేక పాఠశాలలో ఏదైనా చిన్నపాటి కార్యక్రమం నిర్వహించాలన్నా నిధుల కొరత వేధిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వీలైనంత తొందరలో స్కూలు కాంప్లెక్స్‌లు నిర్వహణకు సంబంధిత పాఠశాలలకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

### ఎంఇఒ-2 వివరణ

స్కూల్ కాంప్లెక్స్ నిర్వహణకు నిధులు విడుదల కాకపోవడంపై ఎంఇఒ-2 అరుణకుమార్ కుమార్‌ను వివరణ కోరగా: నిధులు విడుదల కాకపోవడం వాస్తవమేనన్నారు. ఇది స్కూలు కాంప్లెక్స్ హెచ్ఎంలకు ఇబ్బందికరమేనన్నారు.

# టిడిపి, జనసేన పొత్తుతో వైసిపి చిత్తు

'బాబుతో నేను' రచ్చబండలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పొత్తుతో రాష్ట్రంలో వైసిపి చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమని అనకాపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం మార్టూరు గ్రామంలో బాబుతో నేను, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు క్షేమంగా రావాలనీ పరదేశమ్మకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, తుమ్మపాల మాజీ సర్పంచ్ కర్రి బాబీ, కోడి అప్పారావు, అల్లం అప్పారావు, కోట్ని సురేష్, తలారి కాశీ నాయుడు,బత్తుల రమేష్, బొజ్జా అప్పారావు, జనసేన నాయకులు పల్లెల గణేష్, సేనాపతి రవి, పోతిన సాధుబాబు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గమ్మ సారె ఊరేగింపు

ప్రజాశక్తి -యలమంచిలి రూరల్: ఎలమంచిలి మున్సిపాలిటీ 20వవార్డు పెద్దపల్లిలో దసర ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారికి గ్రామస్తులంతా రకరకాల పిండి వంటలతో సారె సమర్పించారు. సుమారు 500 మహిళలు సారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ దాసరి చినమ్మలు కుమార్, వైసిపి నాయకులు బోద్ధపు ఎర్రయ్య దొర, కోడిగుడ్డు రమణబాబు, 21వ వార్డు కౌన్సిలర్ దుంగ అచ్యుతరావు, ఉత్సవ కమిటీ సభ్యులు ,బొద్దపు కాసుల నాయుడు, మరిశ నర్సింగరావు పాల్గొన్నారు.

# ఆలయ నిర్మాణానికి వితరణ

నగదు సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని వెదురుపర్తి దుర్గాదేవి ఆలయం నిర్మాణానికి ఆదివారం తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు రూ.50 వేలు విరాళం అందజేశారు. దీంతోపాటు నర్సింగపల్లి ఆలయ కమిటీకి రూ.10 వేలు, చింతలపాలెం, నూతన గుంటపాలెం ఆలయ కమిటీలకు చెరో రూ.ఐదు వేలు చొప్పున విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉగ్గిని రమణమూర్తి, షేక్ బాబర్, సిదిరెడ్డి శ్రీను, కర్రి దుర్గునాయుడు, నయనంశెట్టి రమణారావు, జెర్రిపోతుల నూకునాయుడు , నారిపల్లి ప్రసాద్, మాజీ ఎంపిటిసి అప్పలనర్స పాల్గొన్నారు

# సాగునీరు వృథాగా పోతున్నా పట్టదా?

## కొత్తూరు ఆనకట్ట పునర్నిర్మాణంలో నిర్లక్ష్యంపై ఆవేదన

కొత్తూరు ఆనకట్ట పరిశీలిస్తున్న సిపిఎం, రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-రాంబిల్లి :మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద ఉన్న శారదానదిలో ఉన్న ఆనకట్ట కొట్టుకుపోయి, సాగునీరు వృథాగా సముద్రం పాలౌతున్న పాలకులు, అధికారులకు పట్టకపోవడం దుర్మార్గమని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిపియం రాంబిల్లి మండల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కొత్తూరు వద్దనున్న కొట్టుకుపోయిన ఆనకట్టను పరిశీలించారు. ఈసందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఐదేళ్ల క్రితం వరదలు కారణంగా కొత్తూరు గ్రామం వద్ద ఉన్న ఏడు మూళ్ళికట్టు కొట్టుకుపోవడంతో సుమారుగా రెండు వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.

ఎన్నికలు సమయంలో పాలక పార్టీల నేతలు ఆనకట్టలు పూర్తి చేసి రైతులకు నీరు అందిస్తామని, పెదకలవలాపల్లి నుంచి రజాల బ్రిడ్జి నిర్మాణం చేస్తామని, మూలజంప గ్రామం వద్ద కాజ్‌వే నిర్మిస్తామని హామీలు ఇచ్చి, ఎన్నికలు అయ్యాక మర్చిపోయారని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు. జిల్లా ఉన్నతాధికారులు రైతాంగం, ఈ ప్రాంత ప్రజలు, రైతుల సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు. జి దేముడునాయుడు, చందక రామకృష్ణ, సిహెచ్.శివాజీ, వై. రాము, ఎన్. నారాయణరావు, చినకలవలపల్లి సర్పంచ్ శ్రీనువాసరావు, ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జగనన్నా..గృహాలు నిర్మించేది ఎలా?

## -లే అవుట్లలో కానరాని కనీస సౌకర్యాలు
## -నిర్మాణాలకు ముందుకు రాని లబ్ధిదారులు

అన్నవరం లే అవుట్‌లో ఏర్పాటు చేసిన బోరు, విద్యుత్ లైను

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో అక్షర క్రమంలో ముందుండే అన్నవరం, ఆక్సాహెబ్ పేట గ్రామాలు మాత్రం అభివృద్ధితో పాటు ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలలో ఆమడ దూరంలోనే ఉన్నాయి. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గొప్పలు చెప్పుకుంటున్న జగనన్న కాలనీ నిర్మాణాలపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. జగనన్న కాలనీ ప్రారంభ తొలి నాళ్లలోనే ఇక్కడ ఏర్పాటు చేసిన లేఔట్లు నివాసయోగ్యానికి అసౌకర్యంగా ఉండటంతో లబ్ధిదారులు పెద్దగా ఆశక్తి చూపలేదు. అన్నవరం గ్రామం సమీపంలో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం నాటి రెవెన్యూ అధికారులు, స్థానిక రాజకీయ నాయకుల అనాలోచిత నిర్ణయంతో కొండ ప్రాంతం ఎంపిక చేశారు. కనీసం లేఅవుట్ మొఖం చూసేందుకు కూడా లబ్ధిదారులు సుముఖత చూపటం లేదు. ఇక్కడ ఏర్పాటు చేసిన లేఔట్ ప్రభుత్వ స్థలం కాదు ప్రైవేటు స్థలం. సుమారు 25 లక్షలు వెచ్చించి మరీ కొనుగోలు చేసి 53 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అధికారులు శతవిధాలా ప్రయత్నాలు చేసినా ఇప్పటికీ ఆ స్థలంలో ఒక్కరు కూడా నిర్మాణం చేపట్టలేదు. ఇప్పుడు అదే స్థలం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయింది. గ్రామంలో ఐదుగురు సొంతంగా స్థలాలు కొనుగోలు చేసుకొని నిర్మాణాల చేపట్టుకు ంటున్నారు. గ్రామంలో పలువురు గ్రామస్తులు ఆ స్థలం నివాసయోగ్యం కాదని నాడు చెప్పినా.. పెడచెవిన పెట్టారు. సొంత ప్రయోజనాలకు నాయకులు, అధికారులు ఆశించి కొనుగోలు చేశారు. అంతేకాకుండా అక్కడ రోడ్లు, బోర్లు లెవెలింగ్ కోసం మరి కొన్ని లక్షలు ఖర్చు చేశారు. అంత ఖర్చు అయినప్పటికీ ఒక్క ఇల్లు కూడా నిర్మించలేకపోయారు.

అక్సాహెబ్ లే అవుట్‌లో ఏర్పాటు చేసిన బోరు, విద్యుత్ లైను

ఆక్షాహెబ్ పేట గ్రామంలో పరిస్థితి మరీ దారుణం. గ్రామంలో కాలనీ ఇళ్ల నిర్మాణాల కోసం అధికారులు ఒకటి కాదు రెండు చోట్ల స్థలం ఎంపిక చేశారు. మొదట ఒక స్థలం 21 లబ్ధిదారుల కోసం ఎంపిక చేసి భూమి లెవెలింగ్ కార్యక్రమం కోసం డబ్బులు ఖర్చు చేశారు. తర్వాత గ్రామంలో వేరొక చోట స్థలం ఎంపిక చేసి అక్కడ లెవెలింగ్ రోడ్లు, కరెంటు లైన్, బోరు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. కానీ. ఆ ప్రదేశాన్ని కూడా గ్రామస్తులు, ప్రజలు తిరస్కరించారు. స్థానిక రాజకీయ నాయకుల స్వప్రయోజనాల కోసమే స్థలాల ఎంపిక చేయడం అక్కడ లెవెలింగ్. బోరు. కరెంటు ఇతరత్రా ఖర్చుల కోసం లక్షలు ఖర్చు చేసి వృధా చేశారని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం అధికారులు, నాయకులు ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో తలలు పట్టుకుంటున్నారు. రెవెన్యూ, హౌసింగ్ అధికారుల నిర్వాహంతో జగనన్న కాలనీ లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో దిక్కులు చూస్తున్నారు. ఈ విషయమై నియోజకవర్గ స్థాయి నాయకులు మాత్రం నోరు మెదపకపోవడం విశేషం.

# ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలి

## - ఏపి రాష్ట్ర పార్ట్ టైం, ఫుల్ టైం, కంటింజంట్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ కె.జనార్ధన్

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 1993వ సంవత్సరం నవంబరు 25కు ముందు తాత్కాలిక ప్రాతిపాదికన నియమితులైన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ రాష్ట్ర పార్ట్ టైం, ఫుల్ టైం, కంటింజంట్ ఉద్యోగుల సంఘం కన్వీనర్ కే.జనార్దన్ కోరారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల్లో ఎన్ ఎంఆర్, డైలీ వేజెస్, పార్టుటైమ్, ఫుల్ టైమ్ కన్సాలిడేటెడ్ పే కంటింజంట్ ఉద్యోగుల సర్వీసు లను క్రమబద్ధీకరించాలన్నారు. 1994 యాక్ట్ ప్రకారం 1993 నవంబరు 25 ముందు నియమితులైన వారు నేటి వరకు పని చేస్తున్న ఉద్యోగులు 30 ఏళ్ల పైబడి సర్వీసు పూర్తి చేసినప్పటికి, సర్వీసులు క్రమబద్ధీకరించకుండానే పదవి విరమణ దశకు చేరుకుంటున్నారన్నారు. నాటికి జిఓ 212 ప్రకారం ఐదేళ్ళు, జిఓ 112 ప్రకారం ప్రకారం 10 ఏళ్ళ సర్వీసు ఉన్న వారికి మాత్రమే గతంలో క్రమబద్ధీకరించారన్నారు.వీరిలో 5 ఏళ్ళు , 10 ఏళ్ళు నిండిన సుమారుగా 2 వేల మందికి సర్వీసు క్రమబద్ధీకరించలేదని తెలిపారు. గత ప్రభుత్వం జారీ చేసిన జిఓ 26 ప్రకారం క్యాజువల్ సెలవులు, ఎక్స్ గ్రేషియా, మెటర్నటీ సెలవులు, పదవి విరమణ వయసు 58 నుండి 60 ఏళ్లకు పెంచడం వంటి సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వీరందరికీ సర్వీసులు క్రమబద్ధీకరించక పదవి విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలు పెంచక పోవడంతో వీరంతా 60 ఏళ్లకే పదవీ విరమణ చేసి, ఆ ప్రయోజనాలు పొందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సర్వీసులను క్రమబద్ధీకరించి ఉంటే లాస్ట్ గ్రేడ్ స్కేల్ వర్తించి ఉండేదన్నారు.

# అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

## - అధికారులకు సెలవు రోజుల్లో తరలింపు

జెసిబితో చేపడుతున్న తవ్వకాలు

ప్రజాశక్తి - చీడికాడ:ఆదివారం వచ్చిందంటే చాలు అక్రమార్కులు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. వేరే మండలం నుండి వచ్చి దర్జాగా జెసిబితో తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. చీడికాడ మండల కేంద్రంలో డోకల వారి పాకల వద్ద కోణం రిజర్వాయర్ మర్లగుమ్మ మెయిన్ కాలువపై గట్టును అక్రమంగా జెసిబితో తవ్వకాలు చేపట్టి వ్యాపారాలు చేసుకుంటూ దజ్జాగా జేబులు నింపుకుంటున్నారు. చోడవరం మండలం మైచర్ల పాలెం గ్రామానికి చెందిన వారు గ్రావెల్‌ను అక్రమంగా వ్యాపారం చేసి జేబులు నింపు కుంటున్నారు. ఆదివారం కావడంతో అధికారులు ఉండరని చూసి వ్యాపారులు ఇష్టా రాజ్యాంగా జెసిబితో ఇరిగేషన్ కాలువ గట్టును తవ్వి వ్యాపారులు కాసులు పోగు చేసు కుంటున్నారు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా మర్లగుమ కాలువ గట్టును తవ్వకాలకు గురి కాకుండా కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.



చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

### రూ. 4 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని పెద్ద బొడ్డేపల్లి 10వ వార్డుకు చెందిన అంజూరి బంగార్రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మృతుని కుటుంబం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌ను కలిసి ప్రభుత్వం తరపున ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులతో మాట్లాడి మృతుని కుటుంబానికి రూ. 4 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కును మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ ఛైర్మన్ కోనేటి రామకృష్ణ, పట్టణ వైసీపీ అధ్యక్షుడు యాకా శివ, మున్సిపాలిటీ జగనన్న సచివాలయాల కోఆర్డినేటర్ తమరాన శ్రీనివాసరావు, వైసిపి 10వ వార్డు ఇంచార్జ్ చీటీల రాము, నాయుడు పాల్గొన్నారు.

మట్లాడుతున్న బంగారయ్య

### ప్రజా వైద్యశాలతో మెరుగైన సేవలు

ప్రజాశక్తి-యస్.రాయవరం:ప్రజా సేవకు మించిన సేవ మరొకటి లేదని కేజీహెచ్ రిటైర్డ్ ఆర్ఎంఓ డాక్టర్ బి.బంగారయ్య అన్నారు. ఆదివారం ఉదయం అడ్డురోడ్డులోని బిబిఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో పాయకరావుపేట నియోజకవర్గ జర్నలిస్టు మిత్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాయకరావుపేట నియోజకవర్గంలో పేద ప్రజలకు అడ్డురోడ్డులో ప్రజా వైద్యశాల ద్వారా గడచిన పది సంవత్స రాలుగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ ప్రాంతప్రజలు అనారోగ్యం బారిన పడడానికి కారణం పౌష్టికాహార లోపంగా గుర్తించామన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నక్కపల్లి ప్రభుత్వా సుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగు తుందన్నారు. రానున్న రోజుల్లో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా టిక్కెట్టు వస్తే విలేఖరుల సోదరులు తమకు అండగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎల్రక్ట్రానిక్ మీడియా, వెబ్ ఛానల్ విలేకర్లు పాల్గొన్నారు.

### పంచకర్లను కలిసిన నేతలు

పంచకర్లతో నాయకులు

ప్రజాశక్తి-గొలుగొండ: ఇటీవల విశాఖ ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులుగా నియమితులైన పంచకర్ల రమేష్‌బాబుని కృష్ణదేవిపేట జనసైనికులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజక వర్గంలో జరుగు తున్న పరిణామా లను నాయకులు, ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేవుడు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుత, 2024 ఎన్నికల్లో రాజ్యాధికారం లక్ష్యంగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ అధ్యక్షులు పూడి చక్రవర్తి, పంచాడ హరినాథ్, కృష్ణదేవిపేట స్కూల్ కమిటీ చైర్మన్ అనిశెట్టి గోపి, అల్లాడ సురేష్, పాతల శివ, జనసేన పార్టీ సేవాదళ సభ్యులు వర్మ, ఈర్ని చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# తెరపైకి సన్యాసిపాత్రుడు

**- అన్న అయ్యన్న దూకుడుకు కళ్ళెం వేసేందుకు రంగంలోకి..**
**-ఎమ్మెల్యే టికెట్ కావాలంటూ అధిష్టానాన్ని కోరినట్లు సమాచారం**



**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్ :** మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు అయ్యన్నపాత్రుడు దూకుడుకు కళ్ళెం వేయాలని వైసీపీ నాయకులు భావిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో టీడీపీకి కంచుకోట అయిన నర్సీపట్నంలో గత ఎన్నికల్లో వైసీపీ గెలవడం నిజంగా పెను సంచలనమే. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ క్యాడర్‌ను సమన్వయ పరచడంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. దీంతో ముళ్ళును ముళ్ళు తోనే తీయాలనే సామెత ద్వారా మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోదరుడు సన్యాసి పాత్రుడను (జమీలు)ను రంగంలోకి దింపాలని వైసీపీ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

మాజీ మంత్రి అయ్యన్న నియోజకవర్గం నుంచి ఏకంగా 5 సార్లు విజయం సాధించారు. అలాంటి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో జగన్ ఫ్యాను గాలికి సైకిల్ టైర్ పంక్చర్ అయ్యింది. అలాంటిది ఇప్పుడు అధికార వైసీపీకి గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ కంచుకోటగా పేరొందిన నర్సీపట్నం కోటను గత ఎన్నికల్లో బద్దలు కొట్టిన వైసీపీ నేడు నానా తంటాలు పడుతున్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఈ నియోజకవర్గం నుంచి 1983 మొదలు ఇప్పటి వరకూ 5 సార్లు విజయం సాధించారు. అలాంటి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్ధి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విజయం సాధించారు. టీడీపీకి, అయ్యన్నకి కంచుకోటగా ఉన్న నర్సీపట్నంలో ఇతర అభ్యర్థి విజయం సాధించడం అంత ఈజీ కాదు. అలాంటిది విజయం సాధించిన అనంతరం నియోజకవర్గంలో పార్టీని, క్యాడర్‌ను సమన్వయం చేయడంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ విఫలమయ్యారనేది ఆ పార్టీ వర్గాల నుంచి వినపడుతున్న మాట. అయ్యన్నను రాజకీయంగా ఎదుర్కోవడంలో కూడా ఆయన ఫెయిల్ అయ్యారనే వాదన బలంగా ఉంది. అయ్యన్నపాత్రుడు ముఖ్యమంత్రి పైనా, ప్రభుత్వం పైన ఘాటైనా వ్యాఖ్యలు చేస్తున్నా ఎమ్మెల్యే నుంచి సరైన స్పందన లేకపోవడంతో కేడర్ నిస్సహాయత చెందుతుంది.

నర్సీపట్నం నియోజకవర్గంలో అయ్యన్న దూకుడుకు కళ్ళెం వేసేందుకు వేస్తున్నట్టు సమాచారం. ఉమ్మడి విశాఖ జిల్లాల్లో టీడీపీకి కంచుకోట అయిన నర్సీపట్నంలో గత ఎన్నికల్లో వైసీపీ గెలవడం నిజంగా పెను సంచలనం. అయితే గెలిచిన తర్వాత ఉమా శంకర్ గణేశ్ క్యాడర్ విషయంలో విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో అయ్యన్నను ఎదుర్కోవాలంటే ఆయన సోదరుడు సన్యాసి పాత్రుడు (జమీలు)ను బరిలోకి దించాలని వైసీపీ కేడర్ కోరుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే గణేష్, సన్యాసి పాత్రుడు ఎడముఖం పెడ ముఖంగా ఉన్నారని కార్యకర్తలు చెపుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా నియోజకవర్గంలో గొలుగొండ మండలం జోగంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట, పాత కృష్ణదేవి పేట, నాతవరం మండలం గునుపూడి, మన్యపురట్ల, ఇలా నాలుగు మండలాల్లోనూ నేతలు మధ్య ఉన్న విభేదాలు సరి చేయలేకపోయారు. అలాగే మున్సిపాలిటీ లోనూ సమన్వయం చేయలేక పోవడంతో కొందరు సీనియర్ నాయకులు కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. ఇప్పుడున్న పరిణామాల దృష్ట్యా అయ్యన్నను ఓడించేందుకు అన్ని వనరులు వైసీపీ అధిష్టానమే సమకూర్చే అవకాశం ఉంది. సన్యాసిపాత్రుడు పార్టీలోకి వచ్చిన తరువాత ఆయనకు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తగిన ప్రాదాన్యత ఇవ్వకపోవడం, అనుభవం లేని కొందరు వ్యక్తులకు మాత్రమే ఎమ్మెల్యే ప్రాదాన్యత ఇవ్వడం వంటి అంశాలు పార్టీని గందరగోళంలోకి నేడుతున్నాయి. ఈ పరిణామాలు చూసిన తరువాత అయ్యన్న సోదరుడు సన్యాసి పాత్రుడు కూడా టికెట్ తనకు కేటాయించాలని అధిష్టానాన్ని కోరారట. అయ్యన్న సోదరుడు సన్యాసిపాత్రుడికి అవకాశం ఇస్తే బాగుంటుందని అగ్రనాయకత్వం, నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ధర్నా చేస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

## 685వ రోజుకు మత్స్యకారుల ధర్నా

**ప్రజాశక్తి -నక్కపల్లి:** హెటిరో డ్రగ్స్ పరిశ్రమకు కొత్త పైపులైన్ ఏర్పాటుకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పైప్ లైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత మహా ధర్నా 685వ రోజుకు చేరింది. ఆదివారం మత్స్యకారుల ధర్నాలో అప్పలరాజు మాట్లాడారు. ఇప్పటికే కంపెనీ వేసిన పైపులైన్‌తో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేసారు. కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఉనికికే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. మత్స్యకారుల ఉపాధిని, జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు జి.సోమేశ్వరరావు, సిహెచ్ సోమేష్, వి.అప్పారావు, బి.నూకరాజు, ఎం.నానాజీ, ఎం.బైరాగిరాజు, ఎం.శివాజీ, కె.కాశీ తదితరులు పాల్గొన్నారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి- నక్కపల్లి:** నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 2002-2004లో కళాశాలలో చదువుకున్న ఇంటర్మీడియట్ బ్యాచ్ విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పిన నక్కపల్లి కళాశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగ, వ్యాపార, రాజకీయాల్లో స్థిరపడిన వారంతా చాలాకాలం తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాలలో ఉదయం నుండి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. తమకు విద్యనేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరిశే దయానంద్ (దిలీప్), శంకర్, శ్రీకాంత్, రామరాజు, వినోద్, దుర్గ,అశ్విని, స్వాతి, సుజాత, వైష్ణవి పాల్గొన్నారు.

## ఇద్దరు ఎస్ఐల బదిలీ

**ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్ :** నర్సీపట్నం పట్టణ, రూరల్ పోలీసు సర్కిళ్లలోని ఇద్దరు ఎస్ఐలు బదిలీ అయ్యారు. నర్సీపట్నం పట్టణ ఎస్ఐగా పని చేస్తున్న ధనుంజయ నాయుడును నర్సీపట్నం రూరల్ ఎస్సైగా బదిలీ చేశారు. అక్కడ ఎస్ఐగా పని చేస్తున్న రామారావును నాతవరం ఎస్ఐగా బదిలీ చేశారు. నాతవరం పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఎస్ఐ స్థానం ఖాళీ కావడంతో రూరల్ ఎస్ఐ రామారావు ఇప్పటివరకు ఇన్చార్జి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించారు. ఇక నుండి ఆయన నాతవరం ఎస్ఐగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టనున్నారు.

## దుర్గాదేవికి వెండి కిరీటం వితరణ

**ప్రజాశక్తి -పాడేరు:** మండలంలోని ఇరడాపల్లి గ్రామంలో దుర్గాదేవి అమ్మవారికి గ్రామంలోని భక్తురాలు నారాయణమ్మ వెండి కిరీటం తయారు చేయించి దసరా ఉత్సవాలను పురష్కరించుకొని ఆలయానికి అందజేశారు. మందు పాతర పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన కానిస్టేబుల్ అప్పన్న దొర జ్ఞాపకార్థంగా ఆలయానికి వెండి కిరీటం బహుకరించారు.

# సమస్యల పరిష్కారంలో విఫలం

**ప్రజాశక్తి- చీడికాడ:** నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంలో డిప్యూటి సిఎం బూడి ముత్యాలనాయుడు విఫలం అయ్యారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్పడం ఖాయమని మాడుగుల తెలుగుదేశం పార్టీ నాయకులు పైలా ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తురువోలులో పైలా మాట్లాడుతూ, జైతవరం సభలో తనతో సహా టిడిపి నేతలపై మంత్రి బూడి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. నియోజకవర్గ సరిహద్దులు తెలీవన్నట్టు మంత్రి చేసిన వ్యాఖ్యలు ఆయన విచక్షణా జ్ఞానాన్ని చూపిస్తున్నదని అన్నారు. గత 15 ఏళ్ల నుంచి తాను ప్రతీ గ్రామం తిరిగి, నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సాయం అందించి సమస్యలను గుర్తించడంలోనూ మంత్రి కంటే మెరుగైన అవగాహన కలిగి ఉన్నానన్న విషయం ప్రజలకి తెలుసన్నారు. తురువోలుకి జడ్పీటీసీ నిధులు ఎందుకు కేటాయించలేదని, దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని పైలా డిమాండ్ చేసారు. గతంలో తురువోలులో తెలుగుదేశం హయాంలోనే రోడ్లు వేసి అభివృద్ధి చేశారన్నారు. తురువోలులో ఇప్పటివరకు సచివాలయం నిర్మాణం జరగ లేదన్నారు. జిల్లాలో అత్యంత వెనుకబాటులో వున్న మాడుగుల నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి నోచుకుని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ప్రాతినిధ్యం వహించే వారికి నిర్మాణాత్మక ఆలోచన, ప్రణాళికలతో పాటు దూరదృష్టి అవసరమని గుర్తు చేసారు. మంత్రి తాము ప్రస్తావిస్తున్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేసినా బాగుండేదన్నారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు క్లస్టర్ ఇంచార్జి రెడ్డి సన్యాసి నాయుడు, రెడ్డి రాము, పాత్రుని సురేష్, గొర్లి రామునాయుడు, గొర్లి గణేష్, పుట్ట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**టిడిపి నేత పైలా ప్రసాదరావు**

మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

## కాజ్ వే నిర్మించాలి

**- ఆదివాసీ గిరిజన సంఘం**

**ప్రజాశక్తి-డుంబ్రిగుడ:** మండలంలోని శీలం గోంది రోడ్డు చంప పట్టిగెడ్డ వద్ద కొట్టుకు పోయిన కాజ్ వేను పునర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత 2014లో కురిసిన హుదూద్ తుఫానుకు చంపపట్టి గెడ్డ వద్ద నిర్మించిన కాజ్వే కొట్టుకు పోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం పునాదిని నిర్మించక పోవడంతో ఆ ప్రాంతంలోని గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాజ్‌వేను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ ప్రాంత గిరిజనులతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు - సిఐటియు నాయకుల సమక్షంలో టూరిజం ఎమ్‌డితో చర్చలు**

**ప్రజాశక్తి-అరకులోయ :** ఏజెన్సీ ప్రాంతంలోని ఆరు ఏపీ టూరిజం యూనిట్ల పరిధిలోని టూరిజం కార్మికుల సమస్యల పరిష్కరానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత ఏ రోజునైనా సమ్మెబాట పట్టవచ్చునని ఏపీ టూరిజం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో టూరిజం కార్పొరేషన్ ఎండి కన్నబాబుకి సమ్మె నోటీసులు సమర్పించిన విషయం తెలిసిందే. సమ్మె విషయం ఎమ్మెల్సీ రవిబాబు దృష్టికి కూడా టూరిజం కార్మికులు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో సమర్పించారు.ఇందుకు స్పందించిన రవి బాబు టూరిజం కార్మికులతో, టూరిజం ఎండితో మధ్యవర్తి గా వ్యవహరించి ఆదివారం సిఐటియు నాయకుల సమక్షంలో పలు సమస్యలపై చర్చించారు. టూరిజం ఎండి కన్నబాబుతో ఫోన్లో చర్చించి కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను కూలం కుశంగా వివరించారు. కార్మికుల న్యాయపరమైన కోరికలు పరిష్కరించాలని ఆయనతో చర్చించగా కొన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించారని రవిబాబు కార్మికులకు తెలిపారు. కార్మికులతో టూరిజం ఎండి నేరుగా కూర్చుని చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలతని కార్మికులు కోరారు. ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కనీసం 15 రోజులు గడువు కావాలని కార్పొరేషన్ ఎండి చెప్పినట్లు రవిబాబు అన్నారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఏ రోజునైనా సమ్మెకు వెళ్లడానికి కార్మికులందరూ సిద్ధంగా ఉన్నారని కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. కార్మికులతో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కూడా కార్మిక సంఘం నాయకులతో సోమవారం చర్చించనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి గంగరాజు, టోకూరు సర్పంచ్ మొస్య, అరకులోయ మాజీ ఎంపీపీ అరుణ కుమారి సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఏపీ టూరిజం కార్మిక సంఘం నాయకులు గంగరాజు, బాబురావు, నరసింహ, అంజలిరావు పాల్గొన్నారు.

నాయకులు, కార్మికులతో మాట్లాడుతున్న రవిబాబు